క్లుప్తంగా

వెలిగిన వీధి దీపాలు


బ్రహ్మంగారి మఠం వీధిలో వెలుగుతున్న వీధి దీపాలు

సాక్షి ఎఫెక్ట్..

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని రజక కాలనీ, బ్రహ్మంగారిమఠం వీధుల్లో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్న వైనంపై 'వారం రోజులుగా వెలగని వీధి దీపాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గురువారం రాత్రి నుంచి వీధి దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన 'సాక్షి'కి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన కొమరోలు ఎంపీడీఓ

కొమరోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్.సత్యం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యం పదోన్నతిపై కొమరోలు ఎంపీడీఓగా నియమితులయ్యారు. డిప్యూటీ ఎంపీడీఓ చెన్నారావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ


వేణు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాంబాబు

పొదిలి రూరల్: మండలంలోని ఏలూరు పంచాయతీ టి-సల్లూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పూని వేణు కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం సమన్వయకర్త అన్నా రాంబాబు పరామర్శించారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని వేణు సతీమణికి సూచించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, కొత్తపులి బ్రహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

సినిమా టికెట్లు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు


గ్యాస్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని భారత్‌గ్యాస్ గోడౌన్, సినిమా థియేటర్, పెట్రోల్ బంకు, రెస్టారెంట్లను స్థానిక తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో గ్యాస్ సిలిండర్ల స్టాక్ వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సినిమా థియేటర్‌లో అధిక ధరలకు టికెట్లు విక్రయించరాదని సూచించారు. పెట్రోల్ బంకులో వాహనదారులకు విక్రయించే పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలపై సిబ్బందికి సూచనలిచ్చారు. వ్యాపార సముదాయాల్లో అవకతవకలకు పాల్పడకుండా వినియోగదారులకు వస్తువులు విక్రయించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాయబ్ రసూల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట ఆగని ఆర్టీసీ బస్సులు


ఆర్టీసీ బస్సు కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఎదుట ఆర్టీసీ బస్సు ఆపడం లేదని పలువురు రోగులు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. పోరుమామిళ్ల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆగకుండా వెళ్లిపోతున్నాయని ఆరోపించారు. మండలంలోని ఉయ్యాలవాడ, ఆదిమూర్తిపల్లె, సంజీవరాయుడుపేట, ముండ్లపాడు గ్రామాల ప్రజలు ప్రభుత్వ వైద్యశాలకు తరచూ వస్తుంటారు. పోరుమామిళ్ల వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సుల్లో ఎక్కి పట్టణంలోకి రాకుండానే ప్రభుత్వ వైద్యశాల వద్ద దిగుతుంటారు. అలాగే పట్టణంలోని డిపో నుంచి బయలుదేరి వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆగి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లేవి. శుక్రవారం బస్సులు ఆపకపోవడం వల్ల వైద్యశాలకు వచ్చిన వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై ఆర్టీసీ కంట్రోలర్‌కు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదని ప్రయాణికులు వాపోయారు.


మార్కాపురం వెంకటేశ్వరకాలనీ మున్సిపల్ స్కూల్లో అసంపూర్తిగా తరగతి గదులు


మార్కాపురం గరల్స్ హైస్కూల్లో అర్ధంతరంగా నిలిచిన గదుల నిర్మాణం


మార్కాపురం బాయ్స్ హైస్కూల్లో మధ్యలోనే ఆగిన తరగతి గదుల పనులు

చదువుల నిలయం.. సమస్యల వలయం

ఏడాదిన్నర నుంచి ముందుకు సాగని మనబడి నాడు-నేడు పనులు


కొనకనమిట్ల : అభివృద్ధికి నోచుకోని తువ్వపాడు హిందూ, ఏఏ పాఠశాలలు



అసంపూర్తిగా నిలిచిన బచ్చలకూరపాడు ఏఏ పాఠశాల పనులు


పెచ్చిచెట్ల నడుమ నాయుడుపేట పాఠశాల


చేరెడ్డివారిపల్లి పాఠశాల దుస్థితి ఇలా..

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన మనబడి నాడు-నేడు కార్యక్రమానికి కూటమి సర్కారు గద్దెనెక్కగానే మంగళం పాడింది. గడిచిన ఏడాదిన్నర నుంచి పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయగా.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పైసా నిధులు కేటాయించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడమే కారణం
- మార్కాపురం నియోజకవర్గంలో ఫేజ్-1, 2 కింద 226 పాఠశాలల ఎంపిక
- పాఠశాలల అభివృద్ధికి రూ.58.76 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్ సీపీ సర్కారు
- అరకొర వసతుల మధ్యే చదువుకుంటున్న విద్యార్థులు

మార్కాపురం టౌన్/కొనకనమిట్ల:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని యువగళం పాదయాత్రలో పదేపదే చెప్పిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆ హామీని గాలికొదిలేశారు. మార్కాపురం నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 299 ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 29 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మనబడి నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-2 కింద 226 పాఠశాలలను ఎంపిక చేసింది. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు, అదనపు గదులు నిర్మించేందుకు రూ.58.76 కోట్లను గత ప్రభుత్వం మంజూరు చేసింది. నాడు-నేడు ఫేజ్-1 పనులు పూర్తి కాగా ఫేజ్-2లో అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, నీటి సదుపాయం, విద్యుత్, ఫర్నిచర్ పనులు 50 శాతానికి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల వేళ నిలిచిన పనులను కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఏమాత్రం పట్టించుకోలేదు. గడిచిన 15 నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో పాఠశాలల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

పాఠశాలలు రూపురేఖలు మారేనా?

కొనకనమిట్ల మండలంలో మొత్తం 78 పాఠశాలలు ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద 50 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రెండు విడతల్లో రూ.5.40 కోట్లు నిధులు మంజూరు చేయగా 70 శాతం పనులు పూర్తి చేశారు. 15 నెలల క్రితం కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో పాఠశాలల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. మొత్తం 25 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, నూతన భవన నిర్మాణాల పనులకు బ్రేక్ పడింది. అలాగే 28 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిదులు మంజూరు చేసి పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

తాగునీటికీ దిక్కులేదు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గొప్పలు చెప్పడమే తప్ప కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో మరుగుదొడ్లు దారుణంగా ఉంటున్నాయి. కొన్ని పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు లేక, ఉన్నప్పటికీ పనిచేయకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


బేస్తవారిపేటలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కుమారి


పొదిలి : కుంచేపల్లిలో తల్లులకు మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

బేస్తవారిపేట: సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ కె.కుమారి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పోషణ్ మహోత్సవం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. పోషక విలువలు అధికంగా ఉండే పాలు, గుడ్లు, పప్పుదినుసులు, తాజా ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. రిలయన్స్ ఫౌండేషన్, ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యకర్తలకు కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఎఫర్ట్ సంస్థ ప్రతినిధులు పి.రాజారత్నం, ఎస్.లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లి, సలనూతల అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార ప్రాధాన్యతపై సూపర్‌వైజర్ సుభాషిణి అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నారుల ఎత్తు, బరువు నమోదు చేయడంతోపాటు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బాల్య వివాహాలపై బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

పొదిలి రూరల్: మండలంలోని కుంచేపల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాన్ని సీడీపీఓ సుధామారుతి ఆధ్వర్యంలో నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. సరైన పోషకాహారం తీసుకోకుండా చాలా మంది రోగాల బారిన పడి ఆస్పత్రుల్లో మందుల కోసం డబ్బు వృథా చేస్తున్నారని, ఈ పద్ధతి మారాలన్నారు. అనంతరం మొదటి సంతానం ఆడపిల్ల గల కుటుంబాలకు మొక్కలు పంపిణీ చేశారు.

దొమ్మరి కులాన్ని గిరి బలిజగా మార్చడం సరికాదు


కంభం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కంభం: దొమ్మరి కులం పేరును ×గిరి బలిజ×గా మార్పు చేస్తూ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 1793ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ వి.కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. దొమ్మరి కులస్తులను ఆ పేరుతో అవమానపరిచేలా పిలుస్తున్నారని, ఆ పేరు మార్చడంలో ఎలాంటి తప్పు లేదని, అయితే వారిని గిరి బలిజ అని పేర్కొనడం సమంజసం కాదన్నారు. బలిజ కులస్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరించిదని ఆక్షేపించారు. అదే విధంగా వంగవీటి రంగా పేరును కృష్ణా జిల్లాకు పెట్టాలని కోరారు. అన్ని జిల్లాల్లో కాపు భవనాలు పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఒక్క చోట కూడా స్థలం కేటాయించ లేదని, నిధులు విడుదల చేయలేదన్నారు. బలిజ, తెలగ, కాపు ఒంటరి కులాలను బీసీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రమణ, ప్రసాద్, ఉదయగిరి మల్లిఖార్జున, పాండు రంగయ్య, కాసులపాండు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాపు భవనాలు ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాపు సంఘ నాయకులు

బేస్తవారిపేట: ఎన్నికల సమయంలో ప్రతి జిల్లాలో కాపు భవనాలు ఏర్పాటు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు నేటికీ ఆ హామీని నెరవేర్చలేదని కాపు సంఘం నాయకులు విమర్శించారు. బీసీ జాబితాలో చేర్చాలని 70 ఏళ్లుగా పోరాటం చేస్తున్న బలిజ, తెలగ, కాపు, ఒంటరి కులాల ఆకాంక్షను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ జితేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దొమ్మరి కులాన్ని గిరి బలిజగా పేర్కొంటూ ప్రభుత్వం జారీ చేసిన జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బలిజ కులస్తుల మనోభావాలు దెబ్బ తీసే చర్యలకు ప్రభుత్వమే పూనుకోవడాన్ని ఆక్షేపించారు. బలిజ కులంలో ఇతర కులాలను కలపవద్దని కోరారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా పేరు కృష్ణా జిల్లాకు పెట్టాలని కోరారు. ఏపీలో కాపు భవనాలు అన్ని జిల్లాల్లో పూర్తి చేస్తామని ఏడాదిన్నర అయినా ఒక్క రూపాయి విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు ఉదయగిరి మల్లిఖార్జున, పాలబత్తుని శ్రీనివాసులు, అన్నం జనార్దన్, సంకుల శ్రీకాంత్, ఆకుల శ్రీనివాసులు, పీవీ రాజశేఖర్, రామ వెంకటేశ్వర్లు, బత్తిన ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: ఆర్‌డీఎస్ఎస్ పనుల నేపథ్యంలో మండలంలోని అక్కపల్లె, కంకరవానిపల్లె, పొట్టిపల్లె గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

ధనలక్ష్మిగా వాసవీమాత.. మహాగౌరిగా జగదాంబ


మార్కాపురం : గజలక్ష్మీదేవీ అలంకారంలో రాజ్యలక్ష్మి


పాపినేనిపల్లిలో ధనలక్ష్మి అలంకరణలో..


బేస్తవారిపే: గజలక్ష్మీదేవిగా వాసవీమాత


గిద్దలూరు : ధనలక్ష్మి అలంకరణలో వాసవీమాత


మార్కాపురం : సంతానలక్ష్మి అలంకారంలో అమ్మవారు


అమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ధాన్యలక్ష్మిగా..


మార్కాపురం : మహాగౌరి అలంకారంలో జగదాంబ


బేస్తవారిపేట: అన్నపూర్ణదేవిగా చాడేశ్వరీదేవి

మార్కాపురం టౌన్: శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం అమ్మవారి మూలవిగ్రహమూర్తులను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మార్కాపురం పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతను మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు గజలక్ష్మిగా, శివాలయంలో జగదాంబ అమ్మవారు మహాగౌరిగా, అమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ధాన్యలక్ష్మిగా, ప్రసన్న వెంకటేశ్వరస్వామి గుడిలో అమ్మవారు సంతానలక్ష్మిగా దర్శనమిచ్చారు. కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు రామాలయం, పెదారికట్ల మహాలక్షమ్మ ఆలయం, శివాలయం, కొనకనమిట్ల రామదూతక్షేత్రం, రేగడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

బేస్తవారిపేట: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవిగా, సోమవారిపేటలోని చాడేశ్వరీదేవిని అన్నపూర్ణదేవిగా, కోటసత్యమాంబదేవి ఆలయంలో రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. త్రిలోక పుణ్యక్షేత్రం, పాపాయిపల్లె, బేస్తవారిపేటలోని పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

గిద్దలూరు రూరల్: స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, కాశినాయనకుంట ఆవరణలోని గాయత్రి మాత ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయంలో లలిత త్రిపుర సుందరీ దేవి, రేడియో బావి సమీపంలో గల కాళికా మాత ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీవాసవి కన్యాకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ.కోటికి పైగా కరెన్సీ నోట్లతో అలంకరించారు.

అర్ధవీడు: మండల కేంద్రమైన పోలేరమ్మ ఆలయంలో అమ్మవారిని, అంకభూపాలెం రామాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. పాపినేనిపల్లి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మెడికల్ కాలేజీ నిర్మాణంపై దృష్టిపెట్టండి

మార్కాపురం టౌన్: కూటమి నేతలు విమర్శలు పక్కనబెట్టి, మెడికల్ కాలేజీ నిర్మాణంపై దృష్టి సారించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ వింగ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మొహిద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం మండలం రాయవరం వద్ద మెడికల్ కాలేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సుమారు 80 శాతం మేర పనులు పూర్తయిన కాలేజీని ఏడాదిన్నర నుంచి గాలికొదిలేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తే పేదలకు వైద్యం మరింత భారం అవుతుందని వైఎస్సార్ సీపీ నిరసన తెలుపుతుంటే కూటమి నాయకులు అడ్డగోలు విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. పీపీపీ విధానాన్ని పక్కన పెట్టి ప్రభుత్వమే కాలేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కొనకనమిట్ల: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని గొట్లగట్టు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్పీ బాలయ్య పేర్కొన్నారు. మండలంలోని పెదారికట్ల గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమ తెరలు వాడాలని సూచించారు.

మార్కాపురం టౌన్: మండలంలోని దరిమడుగులో శుక్రవారం తిప్పాయిపాలెం పీహెచ్‌సీ డాక్టర్ రోహిత్‌నాయక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 200 మందిని పరీక్షించి మందులు అందజేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ విజయలక్ష్మి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.